# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఒడిశా-ఛత్తీస్‌గఢ్ మధ్య పూరీకి సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.
- ❖ విశాఖ జిల్లా సింహాచలంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఈ సాయంకాలం ఘనంగా ప్రారంభమైంది.
- ❖ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రేపు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తోంది.
- ❖ ఖనిజాల అన్వేషణలో తొలిసారిగా ప్రైవేటు సంస్థలను ప్రోత్సహిస్తున్నామని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" కార్యక్రమం 112వ సంచిక ఈనెల 28న ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం ఒడిశాలోని చిల్కా సరస్సుకు సమీపంలో కేంద్రీకృతమై ఉంది. ప్రస్తుతం ఈ వాయుగుండం ఒడిశాలోని పూరీ తీరానికి నైరుతి దిశగా 40 కిలోమీటర్లు, గోపాల్ పూర్ కు ఈశాన్యంగా 70 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది క్రమేపీ వాయవ్యంగా కదులుతూ, ఒడిశా-ఛత్తీస్ గఢ్ భూభాగాలపైకి వచ్చే అవకాశం ఉందని వెల్లడించింది. ఇది రాగల 12 గంటల్లో బలహీనపడి తిరిగి అల్పపీడనంగా మారనుందని వాతావరణ అధికారి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

మరోవైపు రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు కూడా చురుగ్గా కదులుతున్నాయి. దీని ప్రభావంతో 16 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే

అవకాశం ఉందని తెలిపింది. ఉత్తర కోస్తాంధ్ర, ఒడిశా తీర ప్రాంతాల్లోని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం విశాఖలో వెలసిన శ్రీ సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఈ సాయంకాలం ఘనంగా ప్రారంభమైంది. కొండ దిగువన తొలి పావంచా వద్ద నుంచి స్వామి వారి పుష్పరథాన్ని లాంఛనంగా ప్రారంభించడం ద్వారా గిరి ప్రదక్షిణకు ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇదిలా ఉండగా సింహాచలం కొండ చుట్టూ ఉన్న మొత్తం 32 కిలోమీటర్ల దూరాన్ని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో కాలి నడకన చేరుకోవడం ద్వారా గిరి ప్రదక్షిణను పూర్తి చేస్తారు. ఆషాఢ శుద్ధ పౌర్ణమి నాడు జరిగే ఈ ఆధ్యాత్మిక వేడుకకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మహా విశాఖ నగర పాలక సంస్థ అన్ని ఏర్పాట్లు చేసింది. నగర పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. భక్తులకు అవసరమైన ఆహార పదార్థాలు, తాగునీరు అందించేందుకు తగిన చర్యలు తీసుకున్నామని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి పేర్కొన్నారు. గిరి ప్రదక్షిణ రేపు మధ్యాహ్నం వరకూ కొనసాగుతుందని ఆలయ వర్గాలు వెల్లడించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రేపు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంట్ ఉభయ సభలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీల సహకారాన్ని ప్రభుత్వం ఈ సందర్భంగా కోరనుంది. ఈ నెల 22వ తేదీ నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండగా 23న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్ సభలో 2024 - 25 కేంద్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారు. కాగా, నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశ పెడుతున్న తొలి బడ్జెట్ ఇది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఆరు కొత్త బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఖనిజాల అన్వేషణలో తొలిసారిగా ప్రైవేటు సంస్థలను ప్రోత్సహిస్తున్నామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లో మినరల్ ఎక్స్ ప్లోరేషన్ హ్యాకథాన్, క్రిటికల్ మినరల్స్ రోడ్ షోను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఖనిజ రంగంలో స్వావలంబన సాధించడానికి అనేక సంస్కరణలు తీసుకుని వస్తున్నట్లుగా పేర్కొన్నారు. బొగ్గు రంగంలో దేశం స్వయం సమృద్ధి సాధించిందని గుర్తు చేశారు. గనులు సహా అన్ని రంగాలలో పారదర్శకంగా వ్యవహరించేలా కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ఖనిజ అన్వేషణను వేగవంతం చేశామని పేర్కొంటూ, ఖనిజాలకు ప్రస్తుతం డిమాండ్ బాగా పెరిగిందని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 112వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్' కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 26వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఇటీవల పోర్చుగల్ లోని లిస్బన్ లో గుల్బెంకియన్ అవార్డు పొందిన మహిళా రైతు సెట్టం నాగేంద్రమ్మ అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలానికి చెందిన ఆమె ఈ రోజు ఆకాశవాణితో మాట్లాడుతూ... మొదట ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తన ఇంటి పెరటిలో ఆకు కూరలు పండించామని తెలిపారు. అదేవిధంగా ఒక ఎకరం పొలంలో ప్రకృతి వ్యవసాయం చేశానని తెలిపారు. ఇందులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి రావటంతో తన తోటి రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మక్కువ చూపారని ఆమె పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యాలయంలో నలుగురు అధికారులకు పర్యవేక్షించాల్సిన శాఖలను పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్రకు సిఎం కార్యాలయం, సాధారణ పరిపాలనశాఖ, హోం, ఆర్థిక, ఎక్సైజ్, రెవెన్యూ, దేవాదాయ శాఖలను కేటాయించారు. ఏవీ రాజమౌళి జలవనరులు, విద్యుత్, గనులు, వ్యవసాయం, సీఎంఆర్ఎఫ్, ఫిర్యాదులు తదితర శాఖలను పర్యవేక్షించనున్నారు. ప్రద్యుమ్నకు రవాణా, పురపాలక, పంచాయతీరాజ్, ఆర్టీజీఎస్, అటవీ, పౌరసరఫరాల శాఖలను కేటాయించారు. కార్తికేయ మిశ్రాకు ఆర్థిక, ఐటీ, ఎన్ఆర్ఐ వ్యవహారాలు, సమాచార పౌరసంబంధాలు, పరిశ్రమలు, ముఖ్యమంత్రి ఢిల్లీ, విదేశీ పర్యటనల సమన్వయం తదితర విభాగాలను కేటాయించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మైక్రోసాఫ్ట్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ క్రాష్ కావడంతో నిన్నటి నుంచి స్తంభించిపోయిన ఎయిర్‌లైన్ సిస్టమ్స్ ఇప్పుడు సాధారణ స్థితికి చేరుకున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ రోజు తెల్లవారుజామున మూడు  గంటల నుంచి ప్రపంచ వ్యాప్తంగా విమానాశ్రయాల కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయని ఆయన ప్రకటించారు. ఈ మొత్తం సమస్యను ఈ రోజు మధ్యాహ్నానికి పరిష్కరించామని కేంద్రమంత్రి తెలిపారు. సమస్య తలెత్తినప్పటి నుంచి తాము అన్ని విమాశ్రయాలలోనూ పర్యవేక్షించామని, ప్రయాణాలు రద్దు చేసుకున్న వారికి రీ అడ్జెస్ట్‌మెంట్స్, రీఫండ్స్‌ను కూడా అందిస్తున్నామని రామ్మోహన్ నాయుడు చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు. వివిధ జిల్లాల్లో వేల ఎకరాల్లోని పంటలు నీటమునిగాయి. ఏలూరు జిల్లాలోని పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. తూర్పుగోదావరి జిల్లాల్లో గోదావరికి వరద ప్రవాహం అంతకంతకు పెరుగుతుంది. అదే విధంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో భారీ వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజికి భారీగా వరద పోటెత్తింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోరారు. జిల్లాలో  వరద ప్రభావిత  ప్రాంతా ల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అమరావతి రాజధానితో పాటు, పోలవరం ప్రాజెక్టుకు రావాల్సిన నిధులపై దృష్టిని సారించాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టీడీపీ కేంద్ర మంత్రులకు, ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు. అమరావతిలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో  పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా  సూచించారు. అదే విధంగా "జల్ జీవన్ కృషి సించాయ్ యోజన" కింద రావాల్సిన నిధులపైన కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =